


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 29-08-2026 | సంపుటి - 31 | సంచిక - 96 | రూ : 4 | పేజీలు: 8


# రాష్ట్రంలో నేరాలు పెరిగాయ్!

## తగ్గిన సైబర్, ఆర్థిక మోసాలు

- మూలాల్లోకి వెళ్లినప్పుడే నేర నియంత్రణ సాధ్యం
- అర్ధవార్షిక నేర సమీక్షలో డీజీపీ




హైదరాబాద్: నేరాల వెనక ఉన్న కారణాలేంటో అధ్యయనం చేసినప్పుడే వాటిని నియంత్రించడం సాధ్యమవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. నేర సమీక్ష సమావేశాలు గణాంకాలకే పరిమితం కాకుండా మూలాలను శోధించాలని సూచించారు. రాష్ట్రంలో గత మూడేళ్లలో నేరాలు పెరిగాయని... అయితే తీవ్ర నేరాలు, సైబర్, ఆర్థిక నేరాల్లో మాత్రం తగ్గుదల నమోదైందన్నారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతోపాటు ఇతర విభాగాల బాధ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ... ప్రతి నేరం వెనక ఉన్న కారణాలు, నేరస్థులు అనుసరించే విధానం, దర్యాప్తు తీరు వంటివాటిని లోతుగా విశ్లేషించినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా 2023 జులై 1 నుంచి 2024 జూన్ 30కి, 2025 జులై 1 నుంచి 2026 జూన్ 30కి మధ్య నేరాల సరళిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల అదనపు డీజీ మహేష్‌భగవత్, సీఐడీ డీజీ చారుసిన్హా, సైబర్‌సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు శిఖా గోయెల్, ఈగల్ సంచాలకులు సందీప్ శాండిల్యతోపాటు ఎస్పీలు, కమిషనర్లు పాల్గొన్నారు. మొత్తంగా రాష్ట్రంలో నేరాలు 7.15% పెరిగాయి. 202324 మధ్య 2,65,377 నేరాలు నమోదు కాగా 202526 నాటికి ఇవి 2,84,363కి పెరిగాయి. ఇదే సమయంలో సగటు నేరాలు (ప్రతి లక్షకు నమోదయ్యే నేరాల సంఖ్య) 481.58 నుంచి 491.59కి పెరిగాయి. మాదకద్రవ్యాల కేసులు 2,026 నుంచి 2,960కి (46.10%), రోడ్డు ప్రమాదాలు 29,130 నుంచి 31,891కి (9.48%) పెరిగాయి. సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు (13.29%), ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు (13.28%), తీవ్రమైన నేరాలు 7,019 నుంచి 6,294కు (10.33%) తగ్గాయి.



## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా 'ఇందిరమ్మ టవర్స్'

- లబ్ధిదారుల పేరిట మేమే రిజిస్ట్రేషన్ చేసిస్తాం
- లక్కీ డ్రా ప్రారంభంలో మంత్రి పొంగులేటి
- తొలిరోజు 740 మంది ఎంపిక

హైదరాబాద్: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో నిర్మించే 'ఇందిరమ్మ టవర్స్' పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పేదలకు పైసా ఖర్చు లేకుండా తామే రిజిస్ట్రేషన్ చేసిస్తామని ప్రకటించారు.

తరువాయి 2లో



## దీర్ఘకాలిక నొప్పికి .. మెదడులోనే స్విచ్ఛాఫ్ బటన్

2లో

- ప్రతి వ్యక్తి మెదడును మ్యాపింగ్ చేసి నొప్పి సంకేతాల నియంత్రణ
- ముగ్గురు రోగులపై పరీక్షించగా ఇద్దరిలో సత్ఫలితాలు
- ఒక మహిళకు శాశ్వత ఇంప్లాంట్‌తో ఏడాదిగా నొప్పి నుంచి ఉపశమనం
- స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైన కీలక విషయాలు
- పరిశోధన వివరాలు 'బ్రెయిన్ స్టిమ్యులేషన్' జర్నల్‌లో ప్రచురితం

## తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

# ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ





- సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక
- ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ
- రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

తరువాయి 2లో



## ఎకరం రూ.269 కోట్లు

- రికార్డులు తిరగరాసిన రాయదుర్గం భూముల వేలం
- 5.38 ఎకరాల విక్రయంతో సర్కారుకు రూ.1,447.22 కోట్ల ఆదాయం

హైదరాబాద్: ఐటీ కారిడార్ రాయదుర్గంలోని భూమి ధర ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. వారం క్రితం నమోదైన గరిష్ఠ ధరను బద్దలు కొట్టి ఎకరా రూ.269 కోట్ల ధర పలికింది

తరువాయి 2లో



## ఆర్మీ జవాన్లకు రాఖీలు కట్టిన కశ్మీరీ యువతులు..

- సోషల్ మీడియాలో నెటిజన్ల ఫిదా
- సరిహద్దులను కాపాడుతున్న జవాన్లకు మిఠాయిలు తినిపించిన వైనం
- త్రీయానురాగానికి భావోద్వేగానికి గురైన సైనికులు

రక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని జమ్మూకశ్మీర్‌లోని స్థానిక కశ్మీరీ యువతులు, పాఠశాల

తరువాయి 2లో

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు' బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్



- ఉక్రెయిన్‌కు బ్రిటన్ క్షిపణి టెక్నాలజీ
- దీనిపై తీవ్రంగా స్పందించిన రష్యా

2లో

## ఒంగోలు తాగునీటికష్టాలకు చెక్...

# రంగరాయుడు చెరువు వద్ద కొత్త ప్రాజెక్టు

- ఒంగోలు నగరానికి 24 గంటల తాగునీటి సరఫరాకు శ్రీకారం
- అమృత్ 2.0 ప్రాజెక్టును ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్
- రూ.424.42 కోట్ల అంచనా వ్యయంతో పథకం అమలు
- 51 వేలకు పైగా ఇళ్లకు కొత్తగా కనెక్షన్లు.. 605 కి.మీ. పైప్‌లైన్



ప్రకాశం జిల్లా ఒంగోలు నగర ప్రజల దశాబ్దాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీకారం చుట్టారు. రంగరాయుడు చెరువు వద్ద రూ.424.42 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ పథకానికి ఆయన నేడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను పునర్వ్యవస్థీకరిస్తారు. మొత్తం 605.30 కిలోమీటర్ల పొడవున కొత్త పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్మించి, 51,340 గృహాలకు నేరుగా సర్వీస్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీని ద్వారా నగరంలోని ప్రతి ఇంటికీ నాణ్యమైన తాగునీరు అందనుంది. పెరుగుతున్న నగర జనాభా అవసరాలకు అనుగుణంగా ఈ ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు

తరువాయి 22లో

# బలమైన వాదనలు వినిపించండి

హైదరాబాద్: కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట తెలంగాణ నీటి అవసరాలకు తగ్గట్లుగా బలమైన వాదనలు వినిపించాలని, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై ఎక్కువ దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని కరవు, ఫ్లోరైడ్, వెనకబడిన ప్రాంతాల్లో ప్రజల సాగు, తాగునీటి అవసరాలను ఆధారాలతో చూపి వాదించాలని కోరారు. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన 811 టీఎంసీలపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని, తర్వాత కృష్ణా ట్రైబ్యునల్ 2 కేటాయించిన నీటిపై కసరత్తు ముమ్మరం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతర్రాష్ట్ర జల వివాదాలు, కృష్ణా ట్రైబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు తదితర అంశాలపై ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలిలా ఉన్నాయి. మొదట ట్రైబ్యునల్ ఎదుట వాదనలు, సుప్రీంకోర్టులో కేసులు, ప్రస్తుత పరిస్థితి గురించి సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు, తక్కువ నీటి లభ్యత ఉన్నప్పుడు వినియోగం, తర్వాత మొత్తం కేటాయింపుపై విచారణకు కేంద్రం జారీ చేసిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్), దీనిపై ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కేసు, బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 65 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన కేటాయింపులు, దీనిపై సుప్రీంకోర్టులో కేసు కారణంగా తీర్పు నోటిఫై కాకపోవడం గురించి చెప్పారు.

**శ్ర సెప్టెంబరు 16-18 వరకు తెలంగాణ వాదనలు**

2023 అక్టోబరు 6న కేంద్రం జారీ చేసిన తదుపరి టీఓఆర్ ప్రకారం తుది వాదనలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ వాదనలు ఆగస్టు 13న ముగియగా, తెలంగాణ తరఫున రిజాయిండర్ వాదనలు 14న జరిగాయని, సెప్టెంబరు 16 18 వరకు జరిగే ట్రైబ్యునల్ సమావేశాల్లో తెలంగాణ తదుపరి వాదనలు వినిపించాల్సి ఉందని న్యాయవాదులు వివరించారు. బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించగా.. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ 65 శాతం, సరాసరి నీటి లభ్యతతో చేసిన కేటాయింపులతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1050 టీఎంసీలున్నాయి. అయితే బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పును ఇంకా నోటిఫై చేయనందున మొదట బచావత్ కేటాయించిన 811 టీఎంసీల్లో ఎక్కువ వాటా, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులపై దృష్టి కేంద్రీకరించాలని న్యాయవాదుల బృందానికి, అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం ఇంజినీర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ కేటాయింపులను మనం వ్యతిరేకించి సుప్రీంకోర్టుకు వెళ్తే, అమలు చేయాలని కర్ణాటక కోరుతుందని, ప్రస్తుత లక్ష్యం 811 టీఎంసీలేనని స్పష్టం చేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమలైతే కృష్ణా నదీ యాజమాన్యబోర్డు మనుగడ కూడా ఉండదని, ట్రైబ్యునల్ సిఫార్సు చేసిన పర్యవేక్షణ బోర్డు ఉంటుందని, దీనిని కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

**వరద నీటిపై స్పష్టత ఉండాలి**

వరద నీటిపై కూడా స్పష్టత ఉండాలని, కృష్ణాపై ఉన్న మూడు ప్రాజెక్టులు నిండి పైనుంచి ప్రవహించినపుడే వరద నీరని, అయితే వరద నీటిమీద ఆధారపడి చేపట్టిన ప్రాజెక్టులకు వరద రాకుండానే నీటిని తీసుకోవడాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. మల్యాల, ముచ్చుమర్రి నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తీసుకోవడంవల్ల విద్యుదుత్పత్తిపై ప్రభావం పడుతుందని, వరద లేకుండానే ఆంధ్రప్రదేశ్ మళ్లించినపుడు కోల్పోయే విద్యుత్తుకు పరిహారం కోరే అంశాన్ని, దీనిని ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడం గురించి ఆలోచించాలని న్యాయవాద బృందానికి, ఇంజినీర్లకు సీఎం సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు

## 'నిప్పుతో చెలగాటం ఆడొద్దు' బ్రిటన్‌కు రష్యా స్ట్రాంగ్ వార్నింగ్

ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని రష్యా ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రెండు దేశాలు 'నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయి' అని హెచ్చరించారు. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిస్పందన తప్పదని స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లోనే స్టార్మ్ షాడో క్షిపణులను తయారు చేసుకునే సాంకేతికతను బ్రిటన్ ఇవ్వనుందని లండన్ ప్రకటించింది. దీంతో పాశ్చాత్య దేశాల నుంచి క్షిపణుల సరఫరాపై ఉక్రెయిన్ ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. సుదూర ప్రాంతాల్లో దాడులు చేసే సామర్థ్యం పెరుగుతుంది. బ్రిటన్ ఆయుధాలతో జరిగే దాడులకు ప్రతిగా ఉక్రెయిన్‌లోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరాలపైనా దాడులు జరిగే అవకాశం ఉందని జఖరోవా హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు బ్రిటన్ రష్యా మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది. ఇదే సమయంలో రష్యా-నాటో మధ్య ఉద్రిక్తతలపైనా చర్చ జరుగుతోంది. రష్యా నాటో సభ్యదేశంపై పరిమిత దాడికి ప్రయత్నించే అవకాశం ఉందన్న అమెరికా నిఘా అంచనాలపై వార్తలు వచ్చాయి. అయితే ఈ ఆరోపణలను రష్యా ఖండించింది. నాటోతో తలపడేందుకు తమ దేశం సిద్ధమవుతోందన్న ప్రచారంలో వాస్తవం లేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

## ఎకరం రూ.269 కోట్లు

హైదరాబాద్: ఐటీ కారిడార్ రాయదుర్గంలోని భూమి ధర ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. వారం క్రితం నమోదైన గరిష్ఠ ధరను బద్దలు కొట్టి ఎకరా రూ.269 కోట్ల ధర పలికింది. 5.38 ఎకరాల విస్తీర్ణం కల్గిన ప్లాట్ పీ2 వేలం వేయగా ప్రభుత్వానికి రూ.1,447.22 కోట్ల ఆదాయం సమకూరింది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) శుక్రవారం నిర్వహించిన భూముల వేలానికి భారీ స్పందన లభించింది. స్థానిక, జాతీయ రియల్ ఎస్టేట్ సంస్థలు వేలంలో పోటాపోటీగా పాల్గొన్నాయి. బ్రిగేడ్ సంస్థ చివరి వరకు పోటీ పడినా హైదరాబాద్‌కు చెందిన వంశీరాం బిల్డర్స్ ఎకరాకు రూ.269 కోట్లతో వేలంలో భూమిని కైవసం చేసుకుంది. ఇది రిజర్వ్ కంటే 52.3 శాతం అధికం కావడం విశేషం.

**వారం తిరక్కుండానే..**

ఇదే ప్రాంతంలో గత వారం నిర్వహించిన ప్లాట్ పీ1 వేలంలో ఎకరం రూ.264 కోట్ల ధర పలకగా... 5.25 ఎకరాలకు గాను సర్కారు ఖజానాకు రూ.1,386 కోట్ల ఆదాయం సమకూరింది. వేలం విలువలో 25 శాతాన్ని తొలిదశ చెల్లింపుగా ఇప్పటికే ప్రభుత్వానికి సదరు సంస్థ జమ చేసిందని అధికారులు తెలిపారు. రాయదుర్గం భూములు సర్కారు ఖజానాకు బంగారు గనులుగా మారాయి. 2025, 2026లో టీజీఐఐసీ రాయదుర్గంలో 41.74 ఎకరాల భూములను వేలం వేయగా ఏకంగా రూ.8,457.47 కోట్ల ఆదాయం సమకూరింది.

## రాష్ట్రంలో నేరాలు పెరిగాయ్!

హైదరాబాద్: నేరాల వెనక ఉన్న కారణాలేంటో అధ్యయనం చేసినప్పుడే వాటిని నియంత్రించడం సాధ్యమవుతుందని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. నేర సమీక్ష సమావేశాలు గణాంకాలకే పరిమితం కాకుండా మూలాలను శోధించాలని సూచించారు. రాష్ట్రంలో గత మూడేళ్లలో నేరాలు పెరిగాయని... అయితే తీవ్ర నేరాలు, సైబర్, ఆర్థిక నేరాల్లో మాత్రం తగ్గుదల నమోదైందన్నారు. డీజీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతోపాటు ఇతర విభాగాల బాధ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఆనంద్ మాట్లాడుతూ... ప్రతి నేరం వెనక ఉన్న కారణాలు, నేరస్థులు అనుసరించే విధానం, దర్యాప్తు తీరు వంటివాటిని లోతుగా విశ్లేషించినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగినప్పుడే మెరుగైన ఫలితాలు వస్తాయని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా 2023 జులై 1 నుంచి 2024 జూన్ 30కి, 2025 జులై 1 నుంచి 2026 జూన్ 30కి మధ్య నేరాల సరళిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల అదనపు డీజీ మహేష్‌భగవత్, సీఐడీ డీజీ చారుసిన్హా, సైబర్‌సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు శిఖా గోయెల్, ఈగల్ సంచాలకులు సందీప్ శాండిల్యతోపాటు ఎస్పీలు, కమిషనర్లు పాల్గొన్నారు. మొత్తంగా రాష్ట్రంలో నేరాలు 7.15% పెరిగాయి. 202324 మధ్య 2,65,377 నేరాలు నమోదు కాగా 202526 నాటికి ఇవి 2,84,363కి పెరిగాయి. ఇదే సమయంలో సగటు నేరాలు (ప్రతి లక్షకు నమోదయ్యే నేరాల సంఖ్య) 481.58 నుంచి 491.59కి పెరిగాయి. మాదకద్రవ్యాల కేసులు 2,026 నుంచి 2,960కి (46.10%), రోడ్డు ప్రమాదాలు 29,130 నుంచి 31,891కి (9.48%) పెరిగాయి. సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు (13.29%), ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు (13.28%), తీవ్రమైన నేరాలు 7,019 నుంచి 6,294కు (10.33%) తగ్గాయి.

## ఆర్మీ జవాన్లకు
# రాఖీలు కట్టిన కశ్మీరీ యువతులు..

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థినులు సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న భారత సైనిక జవాన్లకు రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. సొంత కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ సరిహద్దులను కాపాడుతున్న జవాన్లకు రాఖీలు కట్టి, వారికి మిఠాయిలు తినిపించారు. కశ్మీరీ సోదరీమణులు చూపించిన ఈ ఆత్మీయానురాగానికి సైనికులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. సరిహద్దుల్లో తమ రక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న సైనికులకు కృతజ్ఞతగా కశ్మీరీ ఆడబిడ్డలు ఈ వేడుకను నిర్వహించగా... ప్రతిగా జవాన్లు కూడా వారికి ఎల్లవేళలా రక్షణగా ఉంటామని మాట ఇచ్చారు. దీనికి సంబంధించిన హృదయానికి హత్తుకునే వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవ్వడమే కాకుండా, నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది.

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా 'ఇందిరమ్మ టవర్స్'

హైదరాబాద్ : క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో నిర్మించే 'ఇందిరమ్మ టవర్స్' పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పేదలకు పైసా ఖర్చు లేకుండా తామే రిజిస్ట్రేషన్ చేసిస్తామని ప్రకటించారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు వెల్లడించారు. అత్యంత పారదర్శకంగా దరఖాస్తుదారులు, మీడియా సమక్షంలో.. ప్రత్యక్ష ప్రసారంతో ప్రజలందరూ చూసేలా డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో శుక్రవారం 'ఇందిరమ్మ ఇండ్ల' లబ్ధిదారుల ఎంపిక కోసం డ్రా నిర్వహించారు. నాంపల్లిలోని రెడ్‌హిల్స్, రాజేంద్రనగర్‌లోని లక్ష్మీగూడలో చేపట్టిన కార్యక్రమాలకు మంత్రి హాజరయ్యారు. తొలుత రెడ్‌హిల్స్‌లో ఓ మహిళతో డ్రా తీయించి..చీటిలోని లబ్ధిదారు పేరు వేదికపై ప్రకటించడం ద్వారా ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. మొత్తంగా



కుత్బుల్లాపూర్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో 600 మందిని, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 140 మంది లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకుగానూ... 600 మంది (120 మంది వెయిటింగ్ లిస్టులో ఉంటారు)ని లక్కీడ్రాతో ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన చేసి, ఇందులోనూ అనర్హులుంటే తొలగించి వారి స్థానంలో వెయిటింగ్ లిస్టులో ఉన్నవారికి అవకాశం కల్పిస్తారని వివరించారు.

**పది అంతస్తుల్లో..అన్ని సదుపాయాలతో..**

''పది అంతస్తుల్లో టవర్స్ నిర్మిస్తాం. లిఫ్టుతోపాటు మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం. ఒక్కో ఫ్లాటుకు గరిష్ఠంగా 20 గజాల అన్‌డివైడెడ్ వాటా భూమి వస్తుంది. అందులో ఫ్లాట్లు పొందిన వారికి ప్రభుత్వ ఖర్చుతోనే రిజిస్ట్రేషన్ చేసిస్తాం. రిజిస్ట్రేషన్ అయిన పదేళ్ల తర్వాత విక్రయించుకునే హక్కు ఉంటుంది. అంతకుముందే ఏదైనా అత్యవసరమైతే బ్యాంకులో తాకట్టు పెట్టుకోవచ్చు. లబ్ధిదారుల తుది ఎంపిక పూర్తయ్యాక.. ఇంటి తాలూకు ధ్రువపత్రాలు అందిస్తాం. ఆ తర్వాత మూడునాలుగు రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. లబ్ధిదారులు స్వయంగా నిర్మాణ పనులు పర్యవేక్షించుకోవచ్చు'' అని మంత్రి పొంగులేటి వెల్లడించారు. అర్హత ఉండికూడా ఈ విడతలో ఇల్లు రాలేదని ఎవరూ నిరాశ చెందాల్సిన పనిలేదని, ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని, ప్రతి పేద కుటుంబం సొంత ఇంటి కల నెరవేర్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

## దీర్ఘకాలిక నొప్పికి..
# మెదడులోనే స్విచ్ఛాఫ్ బటన్

సంవత్సరాల తరబడి వేధించే దీర్ఘకాలిక నొప్పితో బాధపడేవారికి వైద్య శాస్త్రం కొత్త ఆశను చూపిస్తోంది. మెదడులో నొప్పికి కారణమయ్యే సంకేతాలను గుర్తించి, వాటిని విద్యుత్ ప్రేరణతో అడ్డుకోవడం ద్వారా తీవ్రమైన నొప్పిని నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రతి వ్యక్తి మెదడులోని నొప్పి వ్యవస్థను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేసి, దానికి అనుగుణంగా చికిత్స అందించే ఈ నూతన విధానం వైద్య రంగంలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ పరిశోధన వివరాలు 'బ్రెయిన్ స్టిమ్యులేషన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సర్జన్ వివేక్ బుచ్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనను చేపట్టింది. తీవ్రమైన ముఖ నొప్పితో (ట్రైజెమినల్ సంబంధిత నొప్పి) బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులపై ఈ ప్రయోగాత్మక చికిత్సను పరీక్షించారు. ఇందులో భాగంగా, వారి మెదడులో తాత్కాలికంగా ఎలక్ట్రోడ్లను అమర్చారు. కొన్ని రోజుల పాటు మెదడులోని వేర్వేరు ప్రాంతాలలో విద్యుత్ ప్రేరణ ఇచ్చి, నొప్పికి సంబంధించిన నాడీ సంకేతాలు ఎక్కడ, ఎలా ఉత్పన్నమవుతున్నాయో మ్యాపింగ్ చేశారు. అనంతరం, ఆ నిర్దిష్ట ప్రాంతంలో లక్షిత విద్యుత్ తరంగాలను పంపి నొప్పి సంకేతాలకు 'బ్రేక్' వేశారు. సాధారణంగా గాయం కారణంగా వచ్చే నొప్పి (అక్యూట్ పెయిన్) గాయం నయమవ్వగానే తగ్గిపోతుంది. కానీ దీర్ఘకాలిక నొప్పి (క్రానిక్ పెయిన్) అలా కాదు. గాయం మానిపోయినా, మెదడు మరియు వెన్నుపాములో కలిగే మార్పుల వల్ల ఇది నెలల తరబడి, ఏళ్ల తరబడి కొనసాగుతుంది. దీనికి చికిత్సగా డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (DBS) పద్ధతి అందుబాటులో ఉన్నప్పటికీ, ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఎందుకంటే, నొప్పికి సంబంధించిన నాడీ వ్యవస్థ ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటుంది. అయితే, ఈ కొత్త విధానంలో ప్రతి వ్యక్తి మెదడుకు ప్రత్యేకంగా మ్యాపింగ్ రూపొందించి చికిత్స అందించడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయని పరిశోధకులు తెలిపారు. ఈ అధ్యయనంలో పాల్గొన్న ముగ్గురిలో ఒకరికి పెద్దగా ఉపశమనం లభించలేదు. కానీ, మిగిలిన ఇద్దరు మాత్రం నొప్పి నుంచి గణనీయమైన ఉపశమనం పొందారు. వారిలో ఒకరైన 40 ఏళ్ల మహిళకు, పరీక్షల అనంతరం శాశ్వత ఇంప్లాంట్లు అమర్చారు.

## జీఎస్టీ 2.0: తెలంగాణ కుటుంబాలకు ఊరట.. తగ్గనున్న పన్ను భారం!

- **జీఎస్టీ 2.0తో తెలంగాణ కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం**
- **ఆహార పదార్థాలపై పన్ను రేటు గణనీయంగా తగ్గుతుందని అంచనా**
- **ప్రస్తుతం 10.4 శాతంగా ఉన్న పన్ను భారం 7.1 శాతానికి పడిపోయే సూచనలు**




ప్రతిపాదిత జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వస్తే తెలంగాణలోని కుటుంబాలపై పన్ను భారం తగ్గే అవకాశం ఉందని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్‌ఎస్) తన అధ్యయనంలో వెల్లడించింది. అయితే, ఈ విధానం ప్రజల వద్ద అదనపు నగదును మిగిల్చే కంటే, పెరుగుతున్న ద్రవ్యోల్బణం నుంచి వారికి పాక్షిక రక్షణ కల్పించేందుకే ఎక్కువగా దోహదపడుతుందని నివేదిక స్పష్టం చేసింది. సెస్ అంచనాల ప్రకారం, జీఎస్టీ 2.0 అమలైతే తెలంగాణ కుటుంబాలపై ప్రస్తుతం 5.4 శాతం నుంచి 10.4 శాతంగా ఉన్న పన్ను భారం, 3.9 శాతం నుంచి 7.1 శాతానికి తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆహార పదార్థాలపై పన్ను భారం గణనీయంగా తగ్గుతుందని ఈ అధ్యయనం పేర్కొంది. ఆహారం వస్తువులపై ప్రస్తుతం 2.2 శాతం నుంచి 7.4 శాతం వరకు ఉన్న పన్ను, కొత్త విధానంలో 0.9 శాతం నుంచి 3.4 శాతానికి పడిపోవచ్చని వివరించింది. అదేవిధంగా, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలపై పన్ను సుమారు 13 శాతం నుంచి 45 శాతానికి దిగివస్తుందని నివేదిక అంచనా వేసింది. ఇప్పటికే ఆహార ధరలు సుమారు 17 శాతం మేర పెరిగిన నేపథ్యంలో, ఈ పన్ను తగ్గింపు సామాన్యులకు ఊరటనిచ్చే కీలక పరిణామంగా భావిస్తున్నారు. ఈ కొత్త విధానం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని అధ్యయనం వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని అత్యల్ప ఆదాయ వర్గాలపై పన్ను భారం 10.4 శాతం నుంచి 7.2 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 9.5 శాతం నుంచి 6.3 శాతానికి తగ్గుతుందని పేర్కొంది. మహిళలు నేతృత్వం వహించే కుటుంబాలపై కూడా పన్ను భారం తగ్గే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జాతీయ క్రీడా వారోత్సవాలు-2026 సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మేకల అభినవ్ స్టేడియంలో వివిధ క్రీడా పోటీలను ఘనంగా ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయడం, గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జాతీయ క్రీడా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు యువత వ్యక్తిత్వ వికాసానికి ఎంతో అవసరమని అన్నారు.క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, సహనశీలతతో పాటు జట్టు భావన కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డి. ఇమామ్ కరీం మాట్లాడుతూ, క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా యువత భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శంభు లింగం ,సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు ,కోచ్‌లు యావార్, పవన్ తదితరులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో శిక్షణ పొందుతూ పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అల్లి సుభాష్ యాదవ్ , మరో కార్పొరేటర్ ఖలీల్ జిల్లా యువజన మరియు క్రీడల అధికారి అక్బర్ అలీ , హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఇమామ్ కరీం , అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి శంభు లింగం సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు ,కోచ్‌లు యావార్, పవన్ తదితరులతో పాటు అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఆదార్ సేవా కేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో డి మార్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ యుఐడిఎఐ డిప్యూటీ డైరెక్టర్ రంగనాథ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో ఆధార్ నమోదు తో పాటు సవరణలు కూడా చేయడానికి సేవా కేంద్రాన్ని ప్రారంభం చేసుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రజలకు ఆదార్ కు సంబంధిత సమస్యలపై హైదరాబాదు కు పంపకుండా సూర్యాపేట లోనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ సెంటర్ నందు ఆధార్ నమోదు తో పాటు ఆధార్ లో సవరణలు ఇక్కడే చేస్తారని అన్నారు. ఈ సెంటర్ నందు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యుఐడిఎఐ రీజనల్ మేనేజర్ శ్రీనివాసు, మరియు ఎడి ఎమ్ ఆపరేషన్స్ లాలు , సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు రాఖీ కట్టిన మహిళా ఉద్యోగులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్పూర్తి : రాఖీ పౌర్ణమి సందర్భంగా ఐడీఓసీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కలెక్టరేట్ మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాఖీ పండుగ సోదరభావం, ఆత్మీయత, పరస్పర రక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. కార్యాలయ విధుల నిర్వహణలో కలెక్టర్ అందిస్తున్న సహకారం, మార్గదర్శకత్వానికి మహిళా ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మ జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు విజయ, అనురాధ, సుమలత, జూనియర్ సహాయకురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ వేళ ఆడబిడ్డకు అండగా జిల్లా కలెకర్

* **స్వయం ఉపాధికి కుట్టు మిషన్ అందజేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : రాఖీ పండుగ వేళ ఆడబిడ్డకు అండగా నిలిచారు జి ల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా. జిల్లాలోని దేవరుప్పుల మండలం నీర్మాల గ్రా మానికి చెందిన మహమ్మద్ సుల్తానా బే గం జీవన పరిస్థితిని తెలుసుకున్న కలె క్టర్, ఆమె స్వయం ఉపాధి పొందేందు కు కుట్టు మిషన్‌ను అందజేశారు. భర్త కుటుంబ బాధ్యతలను వదిలి వెళ్లిపోవ డంతో నాలుగేళ్ల చిన్నారితో ఒంటరిగా జీవనం సాగిస్తున్న సుల్తానా బేగం, స్థిర మైన ఆదాయం లేకపోవడంతో జీవనో పాధి కోసం తనకు ఉపాధి కల్పించాల ని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమె పరిస్థితిని సహృదయంతో పరిశీ లించిన కలెక్టర్, స్వశక్తితో జీవనోపాధి పొందేలా చేయాలనే ఉద్దేశంతో కలెక్టరే ట్ లోని తన ఛాంబర్‌లో కుట్టు మిషన్ ను అందజేశారు. కలెక్టర్ సహాయంపై సుల్తానా బేగం హర్షం వ్యక్తం చేస్తూ, తన జీవనానికి అండగా నిలిచినందు కు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ పోరాట అమరవీరులకు ఘన నివాళులు

* **కళ్లెం లో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌లను స్మరించిన సీపీఎం నాయకులు**

లింగాల ఘణపురం/జనగామ, ప్రజా స్పూర్తి : జిల్లా లో విద్యుత్ చార్జీల తగ్గింపు కోసం వామపక్షాలు, మిత్రపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి ఉద్య మంలో ప్రాణత్యాగం చే సిన అమర వీరులను స్మరించుకుంటూ మండలం లోని కళ్లెం గ్రామంలో సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమం లో రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు చేరుకున్నా రు. ఆ సందర్భంగా అప్పటి ప్రభుత్వం ఉద్యమకారులపై లాఠీచార్జి, బాష్పవా యువు ప్రయోగం, కాల్పులు జరపడంతో రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ లు అమరులయ్యారని, వారిని నాయకులు స్మరించుకున్నారు. అమరవీరుల ప్రాణత్యాగ ఫలితంగానే నేటికీ వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందు తున్నదని పేర్కొన్నారు. వారి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజా సమస్యల పై నిరంతరం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీ ఎం పార్టీ మండల నాయకులు తూటి దేవదానం, శాఖ కార్యదర్శి అతియా సుల్తానా, సభ్యులు సిరిగిరి కిష్టయ్య, ముగ్గుపోశయ్య, తిప్పారపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేయూతకు దరఖాస్తుల వెల్లువ..
## అర్హులందరికీ కలెక్టర్ కీలక పిలుపు



జనగామ,ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చేయూత సామాజిక భద్రతా పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరూ 31వ తేదీలోగా తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా బాధితులు, కల్లు గీత, చేనేత కార్మికులు, గ్రేడ్2, 3 ఫైలేరియా బాధితులు అర్హత ప్రమాణాల మేరకు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు మొదటి విడతలోనే సుమారు 7,500 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చేయూత పింఛన్లపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.మహిళా సమాఖ్యలు అర్హులైన మహిళలను గుర్తించి, దరఖాస్తులు నింపడం నుంచి అవసరమైన ధ్రువపత్రాల సేకరణ, సంబంధిత కార్యాలయాల్లో సమర్పణ వరకు సహకరించాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను చేయూత వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయాల్లో, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, పురపాలక కార్యాలయాల్లో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నూరుద్దీన్, డీపీఎం సతీష్, అడ్మిన్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ కు వెన్నుపోటు పొడిచే కుట్ర చేస్తున్న హరీష్ రావు

* **టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి బట్టి అజయ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని తెలంగాణ రక్షణ సేన, టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో, మెదక్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ బట్టి అజయ్, నర్సాపూర్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జ్ అపర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ ,నర్సాపూర్ నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జ్ అపర్ణ మాట్లాడుతూ పలు ముఖ్యాంశాలను వెల్లడించారు.

**బీసీ ద్రోహి హరీష్ రావు**

హరీష్ రావు, పచ్చి బీసీ వ్యతిరేకి అని మరోసారి రుజువైందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేసిన మాధవరెడ్డిని తన ఇంటికి పిలిపించుకుని, శాలువాతో సత్కరించి గౌరవించడం ఆయన బీసీ వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అన్నారు. కార్పొరేటర్‌గా పోటీ చేసినప్పుడు బీసీ సంఘాలు, తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తికి బీఆర్ఎస్ పార్టీలో, హరీష్ రావు వద్ద ఇంతటి ప్రాధాన్యత ఎందుకు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

* **కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే కుట్ర**

మెదక్ వేదికగా కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు హరీష్ రావు పెద్ద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మెదక్ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ, "కేసీఆర్ గొప్పవారైనా, ఆయన కుమారుడికి రాజకీయ వారసత్వం లేదు. కాబట్టి పార్టీ నాయకత్వం తనకే వస్తుంది. మెదక్‌లో మనం అన్నీ గెలుచుకున్న తర్వాత బీజేపీతో ఒప్పందం చేసుకుందాం అని వ్యాఖ్యానించినట్లు, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచే కుట్రమెదక్ వేదికగా హరీష్ రావు పెద్ద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.ఇలాంటి వ్యాఖ్యలు ఆయన రాజకీయ కుటిల బుద్ధికి పరాకాష్ట అని ఆయన విమర్శించారు.

* **బీజేపీతో చీకటి ఒప్పందాలు – రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్ రహస్యం**

హరీష్ రావు బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలతో రహస్య మంతనాలు సాగిస్తున్నారని బట్టి అజయ్ గారు ఆరోపించారు. ఇందుకు 'రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్' కేంద్రంగా మారిందని అన్నారు.అక్కడికి వచ్చే ఒక ఆర్ఎస్ఎస్ పెద్ద మనిషితో హరీష్ రావు పలుదఫాలుగా సమావేశమవుతున్నారని, ఆయన వచ్చిన ప్రతిసారీ తన కార్యక్రమాలను రద్దు చేసుకుని మరీ వెళ్లి చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. తన పదవిని అడ్డుపెట్టుకుని అవినీతి, వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడుతున్న హరీష్ రావు ప్రస్తుతం ముఖ్యమంత్రితో కూడా లాలూచీ పడ్డారని ఆరోపించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు , తెలంగాణ ప్రజలు ఈ రాజకీయ పరిణామాలను గమనించి, ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన మెదక్ నియోజకవర్గ సీనియర్ నాయకులు కేవల్ నందకిషోర్, కాసాపురం అశోక్, మెదక్ జిల్లా టీఆర్ఎస్ స్టూడెంట్ వింగ్ ఎండీ జునైద్, అబ్బాసు ,ఇతర నాయకులు, టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాఖీ పండుగ అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక

* **మేడ్చల్జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కె.శేఖర్ యాదవ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : రాఖీ పండుగ అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక అని మేడ్చల్జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కె.శేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా మహిళా సోదరిమణులు జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరినగర్లో గల శేఖర్ యాదవ్ నివాసంలో కలిసి వారికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి సోదరుమని జీవితంలో ఆ భగవంతుడు వెలుగులు నింపాలని వారు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతోటి ఆయురారోగ్యాలతోటి ఉండాలన్నారు. ఈ యొక్క పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పండుగ రేణుక, జిల్లా ఆఫీస్ జైంట్ సెక్రెటరీ తేజస్విని జిల్లా కార్యవర్గ సభ్యురాలు సంధ్య , సోదరిమణులు ,కూతురు , తదితరులుపాల్గొన్నారు.

## కూరగాయల సాగు చూసి రైతును అభినందించిన కలెక్టర్!

* **ఉద్యాన పంటలతో అధిక ఆదాయం పొందాలని రైతులకు సూచన**



జనగామ, ప్రజాస్ఫూర్తి: కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ, ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక ఆదాయం పొందాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు.శుక్రవారం ఘనపూర్ (స్టేషన్) మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన రైతు పిట్టల రాజు వ్యవసాయ క్షేత్రాన్ని కలెక్టర్ సందర్శించి, దొండ, సొరకాయ, పొట్లకాయ సాగును పరిశీలించారు. పందిళ్ల విధానంలో సాగు చేస్తున్న కూరగాయల తోటను పరిశీలించిన కలెక్టర్, రైతు అనుసరిస్తున్న సాగు పద్ధతులను అభినందించారు. తోట నిర్వహణ, పంటల పెరుగుదల, నీటి వినియోగం, దిగుబడి అవకాశాలపై రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఉద్యానవన పంటల సాగుకు రైతులు ప్రాధాన్యతనిస్తూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుంటే మెరుగైన ఆదాయం పొందవచ్చని కలెక్టర్ సూచించారు.

## సంయుక్త బ్యాంకర్ల మండల సమావేశం




ప్రజాస్ఫూర్తి,భైంసా: శుక్రవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో 202627 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించి ఉమ్మడి మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో రైతు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల పునరుద్ధరణ, స్వయం సహాయక సంఘాల బ్యాంక్ అనుసంధానం, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు తీరుపై సుదీర్ఘంగా సమీక్షించారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందే ఉపకార వేతనాలు సకాలంలో ఖాతాల్లో జమ అయ్యేలా చూసేందుకు బ్యాంక్ ఖాతాల ప్రారంభ ప్రక్రియను వేగవంతం చేయాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సుమారు రెండు వేల కొత్త బ్యాంక్ ఖాతాలను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులు, బ్యాంక్ మేనేజర్లకు సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని రాఖీ పర్యావరణానికి రక్షణ

* **హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రం ఇందిరా నగర్ జే ఎన్ టి యు కాలేజీలో ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కాలేజీ విద్యార్థినిలతో రాఖీ పండుగ సందర్భంగా వివిధ రకాల చెట్లకు రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ చెట్లకు రాఖీలు కట్టే పండుగను హిందూ సంప్రదాయంగా అన్నదమ్ములకు బొట్టు పెట్టి,స్విట్స్ తినిపించి రాఖీలు ఎలా కడుతారో అదే విధంగా మా సంస్థ ఆధ్వర్యంలో గత ఎనిమిది సంవత్సరాలుగా చెట్లకు పసుపు కుంకుమ పూసి చెట్లకు రాఖీలు కట్టి వాటి మధ్యలో పండగను జరుపుకుంటున్నామని,నేడు మనం వాటిని రక్షిస్తే అవ్వి వృక్షాలుగా ఎదిగి మనలను రక్షిస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో జె.న్.టు.యు కాలేజీ అధ్యాపాకులు, విద్యార్థిని, విద్యార్థులు, మహిళలు,సిబ్బంది, పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత దైద హర్షిత్,దైద హర్షిత,దైద హర్షిక తదితరులు పాల్గొన్నారు.

# అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్

* **నందా తండా సర్పంచ్ మాలోత్ బలరాం**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : చుంచుపల్లి మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు . దానిలో భాగంగా నందా తండా గ్రామ సర్పంచ్ మాలోత్ బలరాం స్వగృహం నందు వారి సోదరీమణులు , స్థానిక మహిళలు ఆయనకు రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు . . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని, రాఖీ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలను, ఆరోగ్యాన్ని , ఐక్యమత్యాన్ని తీసుకురావాలని ఆయన కోరుకుంటూ , అనుబంధాలకి అందం , ఆప్యాయతలకే రూపం , అన్నా చెల్లెళ్ల ప్రేమ అనురాగాలకు ప్రతిరూపం రక్షాబంధన్ అని కష్టసుఖాలలో ఆపద సమయాలలో ఒకరినొకరు తోడుగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వారి సోదరీమణులతో పాటు స్థానిక మహిళలు పాల్గొన్నారు .

# జిల్లా వ్యాప్తంగా ఘనంగా రాఖీ పూర్ణిమ వేడుకలు

* **పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీల్లో పండుగ సందడి**

జనగామ, ప్రజాస్ఫూర్తి : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, ఆప్యాయతలకు ప్రతీక గా నిలిచే రాఖీ పూర్ణిమ పండుగను జి ల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నా రు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండ లాలు, గ్రామాల్లో ఉదయం నుంచే పం డుగ సందడి నెలకొంది.సోదరీమణులు తమ సోదరుల చేతులకు రంగురంగు ల రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు కలగా లని ఆకాంక్షించారు.రాఖీ కట్టించుకున్న సోదరులు తమ సోదరీమణులకు బ హుమతులు అందజేసి, జీవితాంతం వారికి అండగా నిలుస్తామని భరోసా ఇ చ్చారు. కుటుంబ సభ్యులు, బంధు మి త్రులు కలిసి వేడుకలను ఆనందోత్సా హాల మధ్య నిర్వహించుకున్నారు.జిల్లా లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ప్రత్యేకంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. విద్యా ర్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి పర స్పర ప్రేమాభిమానాలను పంచుకున్నా రు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని రాఖీ పం డుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివ రించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయా లు, పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులు,రా జకీయ పార్టీల కార్యాలయాలు, సామా జిక సేవా సంస్థలు, మహిళా సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు రాఖీ పూర్ణిమ వేడు కలను ఘనంగా నిర్వహించాయి. పలు చోట్ల మహిళలు పోలీసు అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, సామా జిక సేవకులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు సైతం తమ సోదర, సోదరీమణులతో కలిసి రాఖీలు కట్టుకుని పండుగను ఉ త్సాహంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మార్కెట్లు రాఖీలతో కళకళలాడగా, మిఠాయి దుకాణాలు, బహుమతుల దుకాణాల వద్ద సందడి కనిపించింది. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, రక్షణ బం ధాన్ని మరింత బలపరిచే రాఖీ పూర్ణిమ వేడుకలు జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా కొనసాగాయి.

# అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



ప్రజాస్ఫూర్తి,నల్లగొండ :అన్నా, చెల్లెలు, అక్క, తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా సంవత్సరానికి ఒకసారి జరుపుకునే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సోదరికి తన సోదరుడు కలకాలం రక్షగా, తోడుగా ఉంటాననే నమ్మకాన్ని, భరోసాను రాఖీ పండుగ ద్వారా కల్పిస్తాడని,అదే నమ్మకంతో అక్కా,చెల్లెళ్లు తన సోదరులకు రక్షాబంధన్ కడతారని తెలిపారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రం పానగల్ లో ఉన్న చారుమతి అనాధాశ్రమ బాలికలు జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి రాఖీలు కట్టారు. సోదరీ, సోదరుల ప్రేమానుబంధాలతోపాటు, వారికి రక్షగా నిలుస్తామనే భరోసాను కల్పించే రాఖి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు .తనకు రాఖీలు కట్టిన బాలికలకు జిల్లా కలెక్టర్ స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా శ్రీ సంతోషిమాత జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: శ్రీ విఘ్నేశ్వరుని మానస పుత్రిక శ్రీ సంతోషిమాత జన్మదిన వేడుకలు స్థానిక శ్రీ సంతోషిమాత ఆలయంలో ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న సంతోషి దంపతులు పాల్గొన్నారు. రాఖీ పౌర్ణమి అమ్మవారి జన్మదినం సందర్భంగా తెల్లవారుజాము 6 గంటల నుండి 8 గంటల వరకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు భక్తుల సమక్షంలో అమ్మవారికి రాఖీ కట్టి,రాఖీ ఉత్సవం నిర్వహించి భక్తులు ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. పుట్టినరోజు పురస్కరించుకొని ఉద్యాపన వ్రతం, సామూహిక వడిబియ్య కార్యక్రమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రివేళ అమ్మవారికి నామకరణ మహోత్సవం, పవళింపు సేవ కార్యక్రమం నిర్వహించి జన్మదిన వేడుకలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవాలయం అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ, బట్టారం వంశీకృష్ణ శర్మ, అశోక్ మిశ్రా ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్తా,, అధ్యక్షులు బ్రహ్మాండ్లపల్లి మురళీధర్, ప్రధాన

# సింగభూపాలెం చెరువుకు త్వరలో గోదావరి జలాలు

* **ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం: కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని సుజాతనగర్ మండలంలో గల సింగభూపాలెం చెరువుకు అతిత్వరలోనే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను రానున్నాయని, అందుకు సంబందించిన ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు జలాలు స్థానిక రైతాంగానికి అందకుండా గతంలో అన్యాయం జరిగిందన్నారు. కొత్తగూడెంతో పాటు భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లందు, పినపాక నియోజకవర్గాల సాగు అవసరాలకు ఈ నీటిని మళ్లించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపి గట్టిగా ఒత్తిడి తీసుకువచ్చామని తెలిపారు. జూలూరుపాడు మండలం వినోభానగర్ మీదుగా మండలంలోని చెరువులన్నింటినీ నింపుతూ, అక్కడి నుంచి పెద్దవాగు ద్వారా సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు గోదావరి జలాలు చేరేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వీటికి త్వరలోనే పూర్తిస్థాయి అనుమతులు మంజూరు చేయిస్తామని చెప్పారు. చెరువుకట్ట పునర్నిర్మాణానికి, రక్షణ చర్యలకు రూ.5 కోట్లు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కమిషనర్, సుజాత, ఎంపిడివో భారతి, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, అధికారులు కె మహేశ్వరరావు, కె చంద్రశేఖర్, శ్రావణి, స్థానిక నాయకులు సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు .

# ఆరోగ్యమే మహాభాగ్యం – క్రీడలే ఆరోగ్యానికి పునాది



ప్రజాస్ఫూర్తి, భైంసా: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో భైంసాలోని ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రంలో క్రీడాకారులకు వివిధ వినోదాత్మక క్రీడా పోటీలు నిర్వహించారు. శిక్షణ కేంద్రం కోచ్ సాయికృష్ణ సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్ రజిత పతకాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడం, క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందించడమే జాతీయ క్రీడా దినోత్సవం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. యువత ప్రతిరోజూ క్రీడలు, వ్యాయామం, యోగా వంటి శారీరక కార్యకలాపాలకు సమయం కేటాయించాలని సూచించారు. "ఆరోగ్యమే మహాభాగ్యం – క్రీడలే ఆరోగ్యానికి పునాది" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ముగ్గం విక్రమ్, ప్రకాష్ పాటిల్, ఉప్పు రవీందర్, శ్రీ సాయినాథ్ తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. ఖేలో ఇండియా వూషూ శిక్షణ కేంద్రం క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పరస్పర మైత్రికి రక్షాబంధన్..

# సంప్రదాయ పరిరక్షణకు జంధ్యాధారణ

* **జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి: పద్మశాలి సమాజంలో ఐక్యత, పరస్పర మైత్రి, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో రక్షాబంధన్, జంధ్యాధారణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంజునగర్‌లోని 1000 క్వార్టర్స్‌లో ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో పద్మశాలి జిల్లా సంఘం, శ్రీ భార్గవ పద్మశాలి పరపతి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.ఈ సందర్భంగా పద్మశాలి కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరస్పరం రక్షాబంధన్ కట్టుకున్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా జంధ్యాధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో ఐక్యత, ఆప్యాయత, పరస్పర సహకార స్ఫూర్తిని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

* **సంప్రదాయాలను భావితరాలకు అందించాలి**

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. జంధ్యాధారణకు హిందూ సంస్కృతి, సంప్రదాయాల్లో విశిష్ట స్థానం ఉందన్నారు. ఆధునికత పేరుతో మన మూలాలను మరచిపోకుండా ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.సమాజంలోని ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉంటూ కష్టసుఖాల్లో పరస్పరం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా సమాజ శ్రేయస్సు కోసం కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పద్మశాలీలు ఒకరికొకరు రక్షాబంధన్ కట్టుకుని "నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనిద్దరం కలిసి కులానికి, దేశానికి రక్ష" అంటూ ఐక్యత, సోదరభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భీమనాధుని సత్యనారాయణ, షేర్ కుమారస్వామి,పల్ల రాజేషం,కందగట్ల రవిందర్,నాగుల మహేందర్,కోడూరి సుదాకర్,దాసరి సుదర్శన్, అందెం నర్సింగం,గుండేటి నర్సయ్య,చిప్ప సాయిరాం, సుధాకర్‌తో పాటు పద్మశాలి కులబాంధవులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జన్మదిన వేడుకలు

* **అభిమానుల మెగా రక్తదాన శిబిరం**

ప్రజాస్ఫూర్తి,భైంసా : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి ఆయన నివాసమైన ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ జనసంద్రమైంది.ఉదయం వేళ బాసర ఆలయ ఇ. వో తో పాటు ఆలయ అర్చకులు ఎమ్మెల్యే నివాసానికి చేరుకొని ఆశీర్వచనాన్ని అందజేశారు.. ఉదయం నుండి రాత్రి వరకు ఎమ్మెల్యే నివాసానికి అన్ని మండలాలోని గ్రామ ల నుండి కార్యకర్తలు, నాయకులు పెద్ద మొత్తం లో తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అభిమానులు లడ్డుతో ఆయనకు తులాభారం వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదే విధంగా అభిమానులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 40 మందికి పైగా రక్తదానం చేశారు. ఉదయం వేళ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పవా ర్ రామరావ్ పటేల్ ప్రారంభించారు.

* **ఆశ్రమం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే**

జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ ఆశ్రమ పాఠశాలలో బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు కేక్ కట్ చేసి, రాఖీలు కట్టి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలకు రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభమై పనులు ప్రారంభమవుతాయన్నారు.

* **పురుషోత్తం మహారాజ్ కీర్తన ప్రవచనం**

జన్మదినోత్సవం వేళ ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ పురుషోత్తమ్ మహారాజ్ కీర్తన ప్రవచనం ఉండడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా తన ప్రవచనాన్ని కీర్తన రూపంలో అందించారు. అశేష జన వాహిని తరలిరావడంతో జన్మదిన ఉత్సవం పండుగలా సాగింది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

* **సెప్టెంబరు 15లోగా లక్ష్యాలు పూర్తి చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీలో గృహ నిర్మాణ శాఖ, డీఆర్డీఓ, ఎంపీడీవోలు, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాకు మంజూరైన 4,562 ఇళ్లలో 851 నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. సెప్టెంబరు 15లోగా నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, భూపాలపల్లి నియోజకవర్గంలో మొత్తం 1,100 ఇళ్లు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గుడిసెల సర్వేను పారదర్శకంగా పూర్తి చేసి అర్హులైన పేద కుటుంబాలన్నింటినీ గుర్తించాలన్నారు.భాస్కర్‌గడ్డ 2బీహెచ్‌కే లేఅవుట్‌లో సీవరేజ్, విద్యుత్, తాగునీటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్లకు కారణాలను గుర్తించి లబ్ధిదారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ

* **రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోల్ట్ పోలీసులకు రాఖీ కట్టిన సోదరి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: రాఖీ పౌర్ణమి సందర్భంగా బ్లూకోల్ట్ పోలీసులు విధుల్లో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తుండగా ఓ సోదరి పోలీసులకు రాఖీ కట్టి అభిమానం చాటుకున్నారు.సమాజంలో పోలీసుల పాత్ర పెద్దన్న వంటిదని ఆమె పేర్కొన్నారు. మహిళలు వివిధ రంగాల్లో పనిచేస్తూ ఎప్పుడంటే అప్పుడు ఇంటి నుంచి బయటకు వచ్చి కళాశాలలు, ఉద్యోగాలు, ఇతర పనులకు వెళ్తున్నారని, వారు ధైర్యంగా బయటకు వెళ్లగలుగుతున్నారంటే పోలీసుల భద్రతపై ఉన్న నమ్మకమే కారణమని అన్నారు.చెల్లికి అన్న రక్షణ.. సమాజానికి పోలీస్ రక్షణ అంటూ పోలీసులకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.పండగ రోజు కూడా కుటుంబాలకు దూరంగా విధుల్లో ఉంటూ ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బంది సేవలను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా సిబ్బంది కూడా సోదరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు రాఖీ కట్టడం ద్వారా పోలీసులపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ఆత్మీయ అనుబంధం మరోసారి చాటిచెప్పినట్లయింది.

# ఆడపడుచుల ఆత్మీయతే నాకు కొండంత బలం

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : ఆడపడుచుల ఆత్మీయతే నాకు కొండంత బలం...వారి సంక్షేమం, భద్రతకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఆడపడుచుల ఆత్మీయతను, సోదర భావాన్ని చాటుతూ ప్రతీ సంవత్సరం జరుపుకునే రాఖీ పండుగని పురస్కరించుకొని శుక్రవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నిర్వహించిన రాఖీ వేడుకలకు నియోజకవర్గానికి చెందిన మహిళా ప్రజా ప్రతినిధులు, నాయకురాల్లు, మహిళలు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కి "రక్షా" ను కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ నా గెలుపులో కీలకంగా వ్యవహరించిన మహిళా సోదరీమణులందరికీ "రాఖీ పండుగ" శుభాకాంక్షలుతెలియజేశారు.

# సమాజంలో మహిళల పాత్ర కీలకం

*** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : సమాజంలో మహిళలకు ప్రతి ఒక్కరు గౌరవ మర్యాదలు ఇవ్వాలని, సమాజంలో మహిళల పాత్ర కీలకమని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ తో పాటు వారి సోదరుడు మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ కి నియోజకవర్గానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో షాపూర్ నగర్‌లోని వారి నివాసానికి విచ్చేసి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ కి , వారి సోదరుడు శ్రీనివాస్ గౌడ్ కి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాఖీలు కట్టడం పట్ల కూన శ్రీశైలం గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు. మహిళల అభిమానం, ఆప్యాయత తనకు ఎప్పటికీ ప్రత్యేకమని ఆయన పేర్కొన్నారు.అన్నాచెల్లెళ్ల ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, బాధ్యతలకు రక్షాబంధన్ పండుగ సాక్ష్యంగా నిలుస్తుంది అన్నారు. ప్రతి ఒక్కరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పద్మ , లావణ్య, శ్యామల, సంగీత, అనిత, లతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# వడ్తల్ లో రైస్ మిల్ ను తనిఖీ చేసిన అధికారులు



ప్రజాస్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా ముధోల్ మండల పరిధిలోని వడ్తాల్ గ్రామంలోని ఓ రైస్ మిల్లును శుక్రవారం ఎన్ ఫోర్స్ మెంట్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రైస్ మిల్ లోని ధాన్యం నిల్వలను, సీఎంఆర్ లెక్కలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ధాన్యం, సిఎంఆర్ లెక్కల్లో తేడాలున్నట్లు సంబదిత అధికారులు ముందుగా గుర్తించినట్లు తెలుస్తోంది. రైస్ మిల్ లోనే అధికారులు పంచానామ నిర్వహించి సాక్షుల సంతకాలు తీసుకున్నారు. అయితే తనిఖీల సమయంలో రైస్ మిల్ నడిపిస్తున్న యాజమాని అందుబాటులో లేనట్లు సమాచారం. దింతో అక్కడ ఉన్న గుమస్తా నుండి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై ఎన్ ఫోర్స్ మెంట్ డిటి రాథోడ్ రామును నవతెలంగాణ ఫోన్ లో సంప్రదించగా రైస్ మిల్లును తనిఖీ చేసిన మాట వాస్తవమన్నారు. తనిఖీల్లో వెల్లడైన వివరాల నివేదికను జిల్లా సివిల్ సప్లై అధికారికి అందజేస్తామని చెప్పారు. తనిఖీల్లో ఏమైనా బయటపడ్డాయా అన్న విషయం ప్రశ్నించగా, పూర్తి వివరాల కోసం డిఎస్ఓను అడగాలని సూచించారు.

# ఓర్పు, సహనమే జనాల గుండెల్లో నిలిపిందన్న కందాల



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఎన్నికలు, రాజకీయాలు, గెలుపోటములు వేరు.. కానీ ప్రజల మనసులు గెలుచుకోవడం పాలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి కే సొంతం. శుక్రవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలు పెద్ద ఎత్తున కందాలకు రాఖీ కట్టేందుకు బారులు తీరిన సంఘటన కూసుమంచి మండలంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మహిళలను ఉద్దేశించి ఎన్నికల వరకే రాజకీయాలని తదనంతరం జనం గుండెల్లో చోటు సంపాదించుకోవడం ముఖ్యం అన్నారు. ఈరోజు పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండల సోదరీమణులంతా నాపై చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. ఈ సందర్భంగా కూసుమంచిలో పెండ్లి పీటల పైనుంచి నవవధువు స్వయంగా మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డికి రాఖీ కట్టి తన సోదరుడిగా అపారమైన అభిమానాన్ని చాటుకున్న అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ అన్న చెల్లెలి అనుబంధానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కుంభంకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు ఓ బి సి రాష్ట్ర కార్యదర్శి బెండే శ్రీకాంత్ సతీమణి నాగలక్ష్మి వలిగొండ మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మా అనంతరెడ్డి నర్సాయగూడెం సర్పంచ్ పసల జ్యోతి విజయ్ బొమ్మలరామారం మండలానికి చెందిన మహిళా నాయకురాలు పావని సంగీత ఇంకా తదితరులు శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆయన నివాసంలో కలిసి రాఖీ కట్టి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతిక అని ఇంకా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉంటూ మునుముందు మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

# మా సీఎం రేవంత్ అన్న బోలా శంకరుడు..

*** ఫ్యూచర్ సిటీతో మారనున్న హైదరాబాద్ రూపురేఖలు...**

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బోలా శంకరుడి వంటివారని,కోపం వస్తే తాండవం చేస్తూనే,కాలకూట విషాన్ని సైతం మింగే శక్తిని ఆ భగవంతుడు ఆయనకు ప్రసాదించాడని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,హైదరాబాద్ యూసుఫ్‌గూడ మాజీకార్పొరేటర్ గుర్రం మురళీ గౌడ్ కొనియాడారు.రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిగురుమామిడి మండల కేంద్రంలోని శ్రీమహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో మురళి గౌడ్ విలేకరులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మురళీ గౌడ్ మాట్లాడుతూ రాఖీ పండుగ వేళ రాష్ట్రంలోని మహిళలందరి ఆశీస్సులు సీఎం రేవంత్ రెడ్డికి ఉంటాయని, ఆయన మరో పదేళ్లపాటు సీఎంగా కొనసాగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాదులో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ (ఫ్రై పై సిటీ) హైటెక్ సిటీని మించి అద్భుతంగా రూపుదిద్దుకుంటోందని చెప్పారు. ఈ ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో భాగ్యనగరం దశ,దిశ మారి,ప్రపంచ పటంలో విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

*** మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ ప్రగతి ప్రస్థానం..**



రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన పల్లె పల్లెకు పొన్నమన్న కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగుతుండడం సంతోషకరమని మురళి గౌడ్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా,గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ కార్యక్రమం సాగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందించాలనే లక్ష్యంతో మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న ఈ సుదీర్ఘ యాత్రకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలంటే, మంత్రి పొన్నం లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని మురళీ గౌడ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి: కలెక్టర్ అంకిత్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని, వారికి సురక్షితమైన వాతావరణం కల్పించడంతోపాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారికి, ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతోపాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప, స్వాతి, ప్రియాంక, మౌనిక, దీప్తి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, బాలికలు పాల్గొన్నారు.

# ఓ వైపు వనమహోత్సవం.. మరోవైపు చెట్ల నరికివేత..?

*** చిన్నకొండూరు దేపోని చెరువు పరిధిలో చెట్ల నరికివేతపై కలకలం**

*** రెండు కలప లారీ లోడ్లను అటవీ శాఖ అధికారులకు అప్పగించిన గ్రామస్తులు**

*** సుమారు 2వేల మూగజీవాల పశుగ్రాసం లేకుండా చేశారంటూ పెంపకం దారుల ఆందోళన**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పరిశ్రమల కాలుష్యంతో గాలి విషతుల్యమవుతున్న నేపథ్యంలో, భూతాపం పెరిగి వర్షాలు సమయానికి కురవక కరువు తాండవించే అవకాశం లేకపోలేదు. స్వచ్ఛమైన గాలి, అనుకూల పవనాలతో సమయానికి వర్షాలు కురవాలన్న అటవీ శాతం పెంచడంతో పాటు మొక్కలను విరివిగా నాటాలి. ఇందులో భాగంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విధితమే. కానీ, ఇందుకు విరుద్ధంగా చెట్లను విచక్షణారహితంగా నరికిన సంఘటన చిన్నకొండూరులో చోటుచేసుకుంది.

*** ఒక్క రోజులోనే.. రెండు లారీల కలప**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామపంచాయతీ పరిధి దేపోని చెరువులో ఈ నెల 27వ తేదీన పెద్ద ఎత్తున చెట్లు నరికి వేసిన వైనం చోటుచేసుకుంది. జెసిబి, క్రేన్ సహాయంతో పాటు సుమారు 50మంది చెరువులోని చెట్లను నరికి వేశారు. ఒక్క రోజులోనే రెండు లారీలలో కలపను నింపి పంపించేందుకు సిద్ధం చేశారు.

*** అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు***

చెరువులో విధ్వంసం సృష్టించి, చెట్లని నరికివేసి కలపగా మార్చి 2లారీలలో లోడ్ చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆరోజు సాయంత్రం లారీలను అడ్డుకొని అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెట్లు నరికేందుకు అటవీ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో పాటు అటవీ శాఖ అధికారులకు ఎలాంటి సమాచారం లేదు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు కలపతో నిండిన లారీలను అదే రోజు రాత్రి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు.

*** దేపోని చెరువు ద్వారా సుమారు 2వేల మూగ జీవాలకు పశుగ్రాసం***

చిన్నకొండూరు గ్రామంలో పశుపోషణ ముఖ్యపాత్ర పోషిస్తుంది. గ్రామ పంచాయతీ పరిధిలోని దేపోని చెరువు గ్రామానికి సంబంధించిన మేకలు, గొర్రెలు, గేదెలు, ఆవులు మొత్తం కలిసి సుమారు 2వేల వరకు మూగ జీవాలకు పశు గ్రాసం అందిస్తుంది. ముఖ్యంగా 20సంవత్సరాల పైబడిన తుమ్మ చెట్లు మేకలు, గొర్రెలకు మేతను అందిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీన చెట్ల నరికివేత పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూగ జీవాల పెంపకం దారులు, పాడి రైతులు తమ జీవాలకు పశుగ్రాసం ఎలా తీసుకురావాలని బాధను వ్యక్తం చేస్తున్నారు. తమ మూగజీవాలకు పశుగ్రాసం అందిస్తున్న చెట్లను నరకాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నిస్తున్నారు. ఎవరిని అడిగి నరికి వేశారు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలప కోసమే చెరువులోని చెట్లను నరికి వేశారా అంటూ ప్రశ్నిస్తున్నారు.

*** చెట్ల నరికివేతకు గ్రామపంచాయతీ తీర్మాణం**

చిన్న కొండూరు గ్రామపంచాయతీ పరిధిలోని దేపోని చెరువులో చెట్లను నరికి వేసేందుకు గ్రామపంచాయతీ తీర్మానం చేసినట్లు సంబంధిత పంచాయతీ కార్యదర్శి తెలిపారు. చెట్లు నరికి వేసిన విషయంపై ఫోన్ లో సంప్రదించగా, సంబంధిత చెరువులో గ్రామ పంచాయతీకి సంబంధించిన రెండు మోటార్లు ఉన్నాయని, ఆ మోటార్ల ద్వారా గ్రామానికి నీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆ మోటార్లు భూమిలో కూరుకుపోయి, మోటార్ల వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తడంతో చెరువులోనూ చెట్లు నరికివేయాలని పాలకవర్గం తీర్మాణం చేసినట్లు పేర్కొన్నారు.

*** జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్న గ్రామస్తులు**

దేపోని చెరువులో చెట్లు నరికి వేయడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాల పెంపకం దారులు, పాడి రైతులతో పాటు గ్రామస్తులు సైతం ఏకమయ్యారు. పాలకవర్గం తీసుకున్న నిర్ణయం తప్పు అని ఆరోపిస్తున్నారు. గ్రామానికి సంబంధించిన ముఖ్య విషయాలను గ్రామసభలో పూల కూలంకుశంగా చర్చించిన తర్వాతే తీర్మాణం చేయాలని గ్రామ పెద్దలు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని గ్రామస్తులు నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం.

# నాగేల్లి రాములు కు నివాళులు అర్పించిన కాంగ్రెస్ బిజెపిపార్టీ నాయకులు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి :వలిగొండ కు చెందిన నాగేల్లిరాములు పార్థిహ దేహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ స్థానిక సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి బిజెపి నాయకులు బంధారపులింగస్వామి తదితరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు రాములు గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు అతని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు ఇంకా నివాళులు అర్పించిన వారిలోనాయకులు ఐటి పాముల రవీంద్ర సోమనబోయిన రమేష్ మైసొల్ల రామ నర్సు తదితరులు ఉన్నారు

# ఘనంగా శ్రీ శ్రీ గంగామాత ఆలయం ప్రారంభోత్సవం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని గంగామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళి నాయక్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు భూక్య ఉమా,మాజీ శాసనసభ సభ్యులు శంకర్ నాయక్,మాజీ పార్లమెంటు సభ్యులు కవిత హాజరై గంగామత దేవాలయానికి పూజలు అర్పించి దీవెనలు తీసుకున్నారు.ఈ సందర్భంగా మానుకోట పట్టణంలో ఎంతో ఘనంగా గంగామాత దేవాలయాన్ని ప్రారంభించి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించుకున్నందుకు గంగపుత్రులకు అభినందనలు తెలియజేయడం జరిగింది. వేద పండితుల చేత హోమాలు, పూజలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా గంగా మాత విగ్రహాన్ని ప్రతిష్టించినందుకు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 2000 మందికి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన గంగపుత్ర మహిళలు గంగమ్మ తల్లికి పూజార్పణలు చేయడం జరిగింది.జిల్లా రాష్ట్రస్థాయి గంగపుత్ర సంఘ బాధ్యులు పాల్గొన్నారు.ఈ ఆలయ ప్రారంభోత్సవానికి పట్టణానికి చెందిన పలువురు కుల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగ సంఘాలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గంగపుత్ర సంఘం అధ్యక్షులు మైసా నాగయ్య,గౌరవ అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ,పట్టణ గంగపుత్ర సంఘ అధ్యక్షులు దేశబోయిన వెంకటస్వామి, కార్యదర్శి ఉపేందర్, ట్రెజరర్ దేశ బోయిన అనిల్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చిట్యాల జనార్ధన్,ఎండి ఖలీల్,ఎండి ఫరీద్, నిమ్మల శ్రీనివాస్, బోళ్ళ రాజు, వడ్డే బోయిన శ్రీనివాస్,డాక్టర్ గుడి బోయిన గోపీనాథ్,మద్దర్ల రాజన్న, చుక్కల పరమేశ్వర్, దేశ బోయిన రవి, చుక్కల నాగయ్య,డోలి కృష్ణ,చుక్కల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# తోబుట్టువులు లేని లోటును తీర్చిన వందలాది మంది ఆడబిడ్డల ఆత్మీయ అనుబంధం

*** తోబుట్టువులు లేని లోటును తీర్చిన వందలాది మంది ఆడబిడ్డల ఆత్మీయ అనుబంధం**

కేసముద్రం, మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : రాజకీయాలు,అధికారం, పదవులు ఇవన్నీ తాత్కాలికం.కానీ మనుషుల నడుమ ఉండే ఆప్యాయత, పవిత్రమైన అనుబంధాలే శాశ్వతమని కేసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సమ్మయ్య గౌడ్ సమ్మి ఫౌండేషన్ అధినేత మరోసారి నిరూపించారు.దేవుడు సొంత రక్తసంబంధమైన అక్కచెల్లెళ్లను ఇవ్వలేదనే చిన్న వెలితి ఆయనలో ఉన్నా ఊరంతా తన కుటుంబమే అనుకుని,దారిలో ఎదురయ్యే ఏ మహిళనైనా 'అక్కా బాగున్నావా చెల్లీ బాగున్నావా' అంటూ కంటికి రెప్పలా ఆప్యాయంగా పలకరించే ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి, ఈ ఊరి ఆడపడుచులు అరుదైన నీరాజనం అర్పించారు.రాఖీ పౌర్ణమి వేడుకలకు రెండు రోజుల ముందే సమ్మయ్య గౌడ్ నివాసం ఒక ఆత్మీయ సాగరాన్ని తలపించింది.తమను సొంత అక్కచెల్లెళ్లలా భావించి ఆదరించే నాయకుడికి రాఖీ కట్టి తమ ప్రేమానురాగాలను చాటుకోవడానికి ఏకంగా వందలాది మంది ఆడబిడ్డలు ఒక్కసారిగా ఆయన గృహానికి తరలివచ్చారు. దారిన పోయే పరిచయాన్ని కూడా పవిత్రమైన బంధంగా మలచుకున్న ఒక నాయకుడి ఇంటి ముందర, వందలాది మంది మహిళలు వరుసకట్టి నిల్చున్న ఆ దృశ్యం కేసముద్రం చరిత్రలోనే" న భూతో న భవిష్యత్ "ఘట్టంగా నిలిచిపోయింది.తనపై చూపించిన ఈ అపారమైన ప్రేమను చూసి సమ్మయ్య గౌడ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరా ఇద్దరా



వందల మంది ఆడపడుచులు వచ్చి చేతికి రాఖీలు కడుతుంటే, ఆ పవిత్రమైన బంధానికి ఆయన కళ్ల వెంట ఆనంద భాష్పాలు వరదలా పారాయి. తన ఆనందాన్ని తట్టుకోలేక, రాఖీ కట్టిన ప్రతి ఒక్క ఆడబిడ్డకు సమ్మయ్య గౌడ్ కన్నీళ్లతో పాదాభివందనం చేశారు.

### చదువుతో ఉద్యోగమే కాదు..

# వ్యాపారమూ చేయొచ్చు!



చాలామంది ఉన్నత చదువులు చదివిన యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తారు. అందుకోసం ఎంతో కష్టపడతారు. కానీ.. అవి కొందరికే దక్కుతాయి. మిగతావారికి అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. దాంతో చదివిన చదువు మరే రంగంలో ఉపయోగపడుతుందా? అని కొత్తగా ఆలోచనలు చేస్తున్నారు నేటి యువత. అందులో ఈమె కూడా ఒకరు. ఉద్యోగం రాలేదని దిగులుపడకుండా.. తనకున్న తెలివితో, ఏదైనా సాధించాలనే పట్టుదలతో వ్యాపారం ప్రారంభించింది. అందులో లాభాల బాట పడుతోంది. ఆమెవరో కాదు.. సూర్యాపేట జిల్లాకు చెందిన కొమ్మనబోయిన యామిని.

సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి ఆమె స్వస్థలం. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నుంచి బయోకెమిస్ట్రీలో పీజీ పూర్తి చేసింది. చదువు పూర్తవగానే పోటీపరీక్షలకు రెడీ అయింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే చిరకాల కోరికను నేరవేర్చుకోవాలనుకుంది. కానీ, మరో వైపు ఏదైనా సొంతంగా చేయాలనే ఆసక్తి కూడా ఉండేదట. దాంతో.. ఎలాగూ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు ఆలస్యమవుతున్నాయి కదా సొంత వ్యాపారంపై దృష్టి పెట్టింది.



**భర్త ప్రోత్సాహంతో..**
మామూలుగా ఎవరికైనా ఎన్నో ఆలోచనలు, ఆశలు, కలలు ఉండొచ్చు. కానీ, వాటిని చేయడానికి వెన్నుతట్టి ప్రోత్సహించేవారు కూడా ఉండాలి. అలాంటి సపోర్ట్ యామినికి దొరికింది. ఆమె భర్త డాక్టర్ ప్రేమ్‌చంద్. ఆమె కోరికను నెరవేర్చడంలో భాగమయ్యారు. ఇద్దరూ కలిసి వ్యాపారం గురించి ఎన్నో ఆలోచనలు చేశారు. ఏది చేసినా ప్రత్యేకంగా ఉండాలి అనుకున్నారు. దాంతో ఆమెకి పుట్టగొడుగుల పెంపకం బాగుంటుంది అనిపించింది. అందుకు కారణం కూడా ఉంది. చదువుకునేటప్పుడు ప్రాక్టికల్స్ సమయంలో వీటి ఆరోగ్య ప్రయోజనాలు ఆమెని ఆకర్షించాయట. నేర్చుకున్న దానికి సార్థకత కూడా ఉంటుందనిపించి ఆ వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు.



**అద్దె ఇంట్లో అగచాట్లు తట్టుకుని..**
ఏడాదిక్రితం రూ.5వేలతో వీటి సాగు మొదలుపెట్టింది. తొలిరోజుల్లో పుట్టగొడుగులు పెరగడానికి ఏర్పాటు చేసిన బెడ్లు పదే పదే పాడయ్యాయి. దీంతో నష్టమొచ్చింది. ప్రతి దశనీ నోట్ చేసుకుంటూ లోపాలను సరిదిద్దుకుంటూ మళ్లీ మళ్లీ ప్రయత్నించింది యామిని. ఫైనల్‌గా విజయం సాధించింది. కానీ తామున్నది అద్దె ఇంట్లో. బెడ్లకు నీరు పడుతుంటే గోడలు తడుస్తాయని యజమాని వాళ్లపై కోపగించేవారు. అయినాసరే అలా జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే సాగు కొనసాగించిందామె. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడంతో చుట్టుపక్కలవాళ్లే కేజీ రూ.400 వరకూ పెట్టి తీసుకునేవారు. అదిచ్చిన ఆత్మవిశ్వాసంతో తొర్రూరులో సొంతింటికి చేరుకుంది యామిని.
తర్వాత రూ.50వేల పెట్టుబడితో మూడు గదుల్లో పెంపకం ప్రారంభించింది. 250 వరకు బెడ్లు ఏర్పాటు చేసింది. విత్తనాలను బెంగళూరు ఐఐహెచ్‌ఆర్ నుంచి తీసుకొచ్చింది. రేగడి మట్టి, కొబ్బరిపొట్టు, వరి గడ్డి, సున్నం వాడి పాలిథిన్ కవర్లలో పుట్టగొడుగులను పెంచుతోంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే 45 రోజుల్లో పంట చేతికొస్తుంది. అయితే తొలి 21 రోజులు చీకటి గదిలో ఉంచి, మిగిలిన రోజుల్లో గాలి, వెలుతురు అందేలా చూసుకోవాలి. చుట్టుపక్కలవాళ్లే కాదు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారానూ ఆర్డర్లు వస్తున్నాయి ఇప్పుడు. అంతేకాదు.. బెంగళూరు, హైదరాబాద్, వరంగల్ వంటి పట్టణాలకూ పంపుతోందట యామిని. నెలకు రూ.20వేల వరకూ ఆదాయం వస్తోంది అని సంతోషంగా చెప్తోంది యామిని.





**డ్రై మష్రూమ్స్**
మామూలుగా పుట్టగొడుగుల్ని తాజాగానే వంటకు ఉపయోగిస్తుంటాం. అయితే, యామిని ముదిరిన వాటిని ఎండబెట్టి, 'డ్రై మష్రూమ్స్' చేస్తోంది. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ ఉంటుందట. తనను చూసి చాలామంది మహిళలు వారికీ పుట్టగొడుగుల సాగు నేర్పమని అడుగుతున్నారట. దీనిపై మరింత పట్టు తెచ్చుకోవడానికి బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఇంటర్న్‌షిప్ కూడా చేస్తోందట ఆమె. అది పూర్తయ్యాక శిక్షణ కూడా ప్రారంభించాలనుకుంటోంది. ఆమె కొందరికైనా తన ద్వారా ఉపాధి కలిగించాలనుకుంటోంది. ప్రతి ఒక్కరూ చదువుతోనే ఏదైనా సాధించాలంటే చాలామంది కథ అంతటితో ముగిసిపోయేది. కానీ.. యామినిలాంటి పట్టుదల, స్థిరత్వం, కాంక్ష ఉంటే.. అనుకున్నదే తడవు ఏదైనా ఇట్టే సాధించేస్తారు అనడానికి ఈమె కథే స్ఫూర్తి.




# హార్మోన్లు సమతుల్యంగా..

- ఈ మధ్యకాలంలో చాలామందికి హార్మోన్ల అసమతుల్యత సమస్య వేధిస్తోంది. అయితే, దీనికి కారణం లైఫ్ స్టయిల్ ఛేంజెస్. కాబట్టి మన జీవనశైలిని క్రమబద్ధీకరణలో పెట్టుకుంటే హార్మోన్లు కూడా సమతుల్యంగా ఉంటాయనేది నిపుణుల సలహా. మరి అదెలాగ? అంటే..
- నిద్రలేమి వల్ల హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. కాబట్టి రోజుకి కనీసం 7 నుంచి 8 గంటలు నిద్రపోవాలి.
- ఒకవేళ హార్మోన్ల అసమతౌల్యత ఏర్పడితే.. వాకింగ్, స్విమ్మింగ్.. లాంటి వ్యాయామాలు చేయాలి. ఇలా చేయడం వల్ల కొద్ది కాలంలోనే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు.
- తినే ఆహారంలో కార్బోహైడ్రేట్లు, కొవ్వులు, ప్రొటీన్లు తగినంత మేర ఉండేలా చూసుకోవాలి. రోజూ రెండుమూడు రకాల కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు.. ఎందుకంటే వీటిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలోని ఇన్సులిన్ స్థాయిని సమన్వయపరుస్తుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే బొప్పాయి, యాపిల్, జామ పండ్లను ఎక్కువగా తినాలి.
- శరీరంలో వివిధ హార్మోన్లు ఉత్పత్తి కావడానికి కొబ్బరి నూనె కూడా ఉపయోగపడుతుంది. అంతేకాదు.. దీన్ని ఆహారంలో భాగంగా తీసుకుంటే బరువు తగ్గే అవకాశం కూడా ఉంటుంది.
- శరీరంలో హార్మోన్ల ఉత్పత్తికి, వివిధ కణాలు తిరిగి నిర్మితమవడానికి కొవ్వులు ఉపయోగపడతాయి. ఈ క్రమంలో వెజిటబుల్ ఆయిల్‌స్‌లో పాలీశ్యాచురేటెడ్ కొవ్వులు అధిక మొత్తంలో ఉంటాయి.
- రసాయనాలు, క్రిమి సంహారక మందులు, ప్లాస్టిక్ మొదలైన వాటిలో విష పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు ఇలాంటి వాటిని వాడకపోవడమే బెటర్.
- పదే పదే కాఫీ తాగకూడదు. ప్రత్యేకించి గర్భవతిగా ఉన్నప్పుడు కాఫీ తాగితే కొన్ని సందర్భాల్లో అది ఆరోగ్యం పైన దుష్ప్రభావం చూపించొచ్చు.
- హార్మోన్లు సమతులంగా ఉంటే శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. అంతేకాకుండా ఎలాంటి ఆరోగ్య సమస్యలూ దరిచేరవు.

# నైట్ డ్యూటీ చేస్తున్నారా?



నైట్ షిఫ్టులు చేస్తే జరిగే ప్రమాదలను తెలియజేస్తూ వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఓ జర్నల్‌ని ప్రచురించారు. వరుసగా మూడు రోజులు నైట్ షిఫ్ట్ చేయడం ద్వారా మధుమేహం, స్థూలకాయం ఇతర జీవక్రియ రుగ్మతల బారిన పడతారట.

**వీటిపై ప్రభావం..**
మెదడు పనితీరుసైతం మందగిస్తుంది.
హృదయ స్పందనలు క్రమం తప్పుతాయి.
జీవ సమతుల్యత దెబ్బతింటుంది.
రక్తంలో గ్లూకోజ్ నియంత్రణలో ఉండదు.
బీపీ, గుండె జబ్బులు వచ్చి..
చివరికి హార్ట్ ఎటాక్‌కి దారి తీయవచ్చు.

పరిశోధకులలో ఒకరైన ప్రొఫెసర్ హన్స్ వాన్ డాంగెన్ నైట్ షిఫ్టుల వల్ల కలిగే తీవ్ర పరిణామాలను చెప్పారు.శరీరంలో ప్రోటీన్ లయలను అస్తవ్యస్తంగా మార్చడానికి వరుసగా మూడు రాత్రి షిఫ్టులు సరిపోతాయని, ఇది దీర్ఘకాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. పరిశోధన బృందం రక్త నమూనాలను ఉపయోగించి శరీర రోగనిరోధక వ్యవస్థ, గ్లూకోజ్ నియంత్రణకు సంబంధించిన కీలకమైన ప్రోటీన్‌లను గుర్తించింది. కొన్ని ప్రోటీన్‌లు నైట్ షిఫ్ట్‌ల ద్వారా ప్రభావితం కానప్పటికీ, వాటి లయల్లో గణనీయమైన మార్పులను సంభవించాయి.



కాబట్టి మొత్తానికి చెప్పేదేంటంటే.. నైట్ షిఫ్ట్ డ్యూటీలు చేసేవారు ఆరోగ్యకర ఆహారం తీసుకుంటూ, పగటిపూట సరిపడే నిద్ర పోవాలని చెప్తున్నారు. వ్యాయామం కూడా చేస్తే ఇంకా బెటర్ అని పరిశోధకులు చెప్పారు.

# MOVIE TIME



# మేనకగా ప్రిషా సింగ్

టాలీవుడ్‌లో కొత్తతరం కథానాయికగా తనదైన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న నటి ప్రిషా సింగ్. తొలి చిత్రాలు భారీ విజయాలు సాధించకపోయినా.. అందం, స్క్రీన్ ప్రెజెన్స్, సహజ నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. నిఖిల్ సిద్ధార్థ్ నటించిన 'స్పై'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె.. ఆ తర్వాత అల్లు శిరీష్ 'బడ్డీ'లో ఎయిర్ హోస్టెస్‌గా కనిపించి మెప్పించింది. ప్రస్తుతం కథల ఎంపికలో ఆచితూచి అడుగులు వేస్తున్న ఈ ముంబయి భామ.. గ్లామర్‌తో పాటు నటనకు ఆస్కారమున్న పాత్రలపై దృష్టి సారించింది.

సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లోనూ ప్రిషాకు మంచి ఆదరణ ఉంది. ఇక ప్రస్తుతం అల్లరి నరేష్ కథానాయకుడిగా రూపొందుతున్న 'రంభ ఊర్వశి మేనక' చిత్రంలో టైటిల్ పాత్రలో ప్రిషా సింగ్ నటిస్తోంది. సినిమాల మధ్య గ్యాప్ రావడం కూడా తన కెరీర్‌ను దృష్టిలో పెట్టుకునే తీసుకున్న నిర్ణయమని తెలిపింది. 'హాస్య మూవీస్' సంస్థ, దర్శకుడిని కలిసిన తర్వాత సుమారు రెండు మూడు నెలల పాటు సాగిన ప్రీ–ప్రొడక్షన్ ప్రక్రియలో కథను అర్థం చేసుకున్నానని.. ముగ్గురు మహిళా పాత్రల్లో ప్రాధాన్యత ఉన్న పాత్ర కోసం తనను ఎంపిక చేశారని వెల్లడించింది. ఈ చిత్రంలో అల్లరి నరేశ్‌తో కలిసి పనిచేయడం తనకు మంచి అనుభవాన్ని ఇచ్చిందని ప్రిషా చెప్పింది. సెట్స్‌లో ఆయన ఎప్పుడూ తన సీనియారిటీని చూపించలేదని పేర్కొంది. ఆయన నుంచి నటనతో పాటు సెట్స్‌లో ఉండే తీరును కూడా నేర్చుకున్నానని చెప్పింది. అల్లరి నరేశ్ సినిమాల్లో తనకు 'నాంది' ఎంతో ఇష్టమని ప్రిషా వెల్లడించింది. ప్రస్తుతం ఈ సినిమాపై ఆశలు పెట్టుకున్నది ప్రిషా. చాలాకాలం గ్యాప్ తర్వాత నటిస్తున్న ఈ మూవీ తన సినీ ప్రయాణంలో మరో కీలక అడుగుగా నిలుస్తుందని భావిస్తోంది.



# బయోపిక్‌లో నేషనల్ క్రష్

లెజెండరీ సింగర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత కథతో తెలుగులో ఓ సినిమా రాబోతున్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో బన్నీవాసు ఈ పాన్ ఇండియన్ సినిమాను నిర్మిస్తున్నారు. సుబ్బులక్ష్మి పాత్రలో నటించే హీరోయిన్ దగ్గరే మేకర్స్ కొద్ది నెలలుగా తర్జనభర్జనలు పడుతున్నారు. తొలుత ఈ బయోపిక్‌లో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపించింది. రామాయణతో పాటు రెండు తమిళ సినిమాలతో బిజీగా ఉన్న సాయిపల్లవి ఈ బయోపిక్‌ను రిజెక్ట్ చేసింది. ఆ తర్వాత రుక్మిణి వసంత్ పేరు తెరపైకి వచ్చింది. చివరకు రూమర్‌గానే మిగిలిపోయింది. తాజాగా ఈ బయోపిక్‌లో రష్మిక మందన్న టైటిల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇటీవలే రష్మికను కలిసి డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి ఎంఎస్ సుబ్బులక్ష్మి కథను వినిపించినట్లు సమాచారం. బాలీవుడ్‌తో పాటు దక్షిణాదిలో రష్మికకు ఉన్న క్రేజ్ ఈ బయోపిక్‌కు ప్లస్సవుతుందని మేకర్స్ భావిస్తున్నట్లు తెలిసింది. కథ విన్న రష్మిక తన నిర్ణయాన్ని మాత్రం చెప్పలేదని అంటున్నారు.



# ట్రిపుల్ రోల్‌లో బన్నీ ?

కెరీర్‌లో ఫస్ట్ టైమ్ రాకా కోసం అల్లు అర్జున్ ఓ వెరైటీ ప్రయోగానికి సిద్ధమయ్యాడు. దాదాపు 1300 కోట్ల బడ్జెట్‌తో సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీకి కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ పాన్ ఇండియన్ మూవీలో దీపికా పడుకోణ్, రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ ట్రిపుల్ రోల్ చేయబోతున్నట్లు సమాచారం. తండ్రితో పాటు ఇద్దరు కొడుకులుగా అల్లు అర్జున్ రాకాలో కనిపిస్తాడని అంటున్నారు. మూడు పాత్రల మధ్య అల్లు అర్జున్ చూపించే వేరియేషన్ సినిమాకు హైలైట్‌గా ఉంటుందని టాక్. తండ్రి పాత్రలో వయసు మళ్లిన వ్యక్తిగా బన్నీ నటన సర్‌ప్రైజింగ్‌గా ఉండబోతున్నట్లు సమాచారం. అల్లు అర్జున్ ఇప్పటివరకు డ్యూయల్ రోల్ కూడా చేయలేదు. ఫస్ట్ టైమ్ ఏకంగా ట్రిపుల్ రోల్‌లో కనిపించనుండటం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ఈ వారం ఓటీటీలో రిలీజైన సినిమాలు, వెబ్‌సిరీస్‌లు ఇవే

| | |
|---|---|
| **నెట్‌ఫ్లిక్స్ :** | అల్ఫా (హిందీ)<br>ది లాస్ట్ సెల్యూట్ (ఇంగ్లీష్)<br>ది విష్పర్ మ్యాన్ (ఇంగ్లీష్) |
| **జియో హాట్ స్టార్ :** | పార్ట్ టైమర్స్ (తెలుగు వెబ్‌సిరీస్)<br>ఐ నోబడీ (మలయాళం)<br>మైఖేల్ (ఇంగ్లీష్) |
| **సోనీ లివ్ :** | అన్బే దయానా (తమిళం) |
| **అమెజాన్ ప్రైమ్ :** | కేజీక్యూ (తెలుగు)<br>నాగబంధం (హిందీ)<br>బబితా సింగ్ రిపోర్టింగ్ (హిందీ)<br>బ్యాట్‌మ్యాన్ (ఇంగ్లీష్)<br>ది లాస్ట్ సన్‌రైజ్ (ఇంగ్లీష్) |
| **ఈటీవీ విన్ ఓటీటీ :** | న్యూటన్స్ థర్డ్ లా (తెలుగు) |
| **ఆహా ఓటీటీ:** | ఆకలి రాజ్యం (తెలుగు వెబ్ సిరీస్)<br>హరుడు (తెలుగు) |
| **జీ5 ఓటీటీ :** | బందర్ (హిందీ) |



### రవితేజకు జోడీగా

# ఐశ్వర్య రాజేశ్

సంక్రాంతి సెంటిమెంట్‌ను మరోసారి కొనసాగించేందుకు ఐశ్వర్య రాజేశ్ సిద్ధమవుతోంది. వెంకటేశ్ హీరోగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం'తో 2025 సంక్రాంతి బరిలో ఘన విజయాన్ని అందుకున్న ఆమె.. మాస్ మహారాజా రవితేజ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకున్నది. ఈ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న కొత్త చిత్రం 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో ఐశ్వర్య కెరీర్‌లో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలవనుంది. రవితేజ ప్రస్తుతం 'ఇరుముడి' సక్సెస్ అందుకున్నాడు. చాలాకాలం తర్వాత విజయం అందుకున్న జోష్‌లోనే కొత్త చిత్రాన్ని కూడా వేగంగా ప్రారంభించేందుకు ఆయన సిద్ధమయ్యారు. 'రాజ రాజ చోర' ఫేమ్ హసిత్ గోలి దర్శకత్వంలో రూపొందనున్న ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఐశ్వర్య రాజేశ్‌ను కథానాయికగా ఎంపిక చేసినట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.